సాక్షి
చిత్తూరు
గురువారం । 15 । ఆగస్టు । 2024



నేడు స్వాతంత్య్ర దిన వేడుకలు

జిల్లా కేంద్రంలో స్వాతంత్య్ర దిన వేడుకలు నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసులు కవాతు నిర్వహించారు. - IIలో



అక్రమ క్వారీని సీజ్ చేయాల్సిందే

టీడీపీ నేత అక్రమ క్వారీని అధికారులు వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళన చేశాయి. - IIలో



జైళ్ల శాఖ పెట్రోల్ బంకు

పలమనేరులో జైలు ఉన్న స్థలంలో పెట్రోల్ అవుట్‌లెట్ నిర్మాణానికి ఆ శాఖ ఐజీ శ్రీనివాసరావు బుధవారం భూమి పూజ చేశారు. - IIలో

జిల్లా ఆస్పత్రికి జబ్బు!

చిత్తూరు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి జబ్బు చేసింది. వైద్యుల నిర్లక్ష్యం ఊపిరి తీస్తోంది. మందులు, మాత్రలు కరువవుతున్నాయి. అడుగడుగునా నిర్లక్ష్యం తాండవిస్తోంది. నాడి పట్టని అత్యవసర వైద్యం జనాన్ని ప్రైవేటు వైద్యం వైపు నెట్టేస్తోంది. ప్రసూతి విభాగం గర్భిణులకు కష్టాల పురిటి నొప్పులు తెప్పిస్తోంది. ల్యాబ్ పరీక్షలు, స్కానింగ్‌లు కనికట్టుగా మారాయి. వసతుల లేమి పీడిస్తోంది. సమయ పాలన పాటించని విభాగాలతో రోగులకు అగచాట్లు తప్పడం లేదు. ప్రతి దానికీ రెఫర్ చేయడం పరిపాటిగా మారింది. సోమవారం సాక్షి నిర్వహించిన విజిట్‌లో ఇవన్నీ వెలుగులోకి వచ్చాయి.





చిత్తూరు గిరింపేటకు చెందిన కిషోర్ అనే యువకుడు తనకు గడ్డలున్నాయని.. సోమవారం ఉదయం 10.20 గంటలకు ఆస్పత్రికి వచ్చాడు.10.45కు ఓపీ తీసుకున్నాడు. 10.50కి జనరల్ విభాగం వద్ద క్యూలో నిలుచున్నాడు. 11.20కి డాక్టర్ వద్ద చూపించుకున్నాడు. 11.35కు మాత్రలు ఇచ్చే విభాగానికి వెళ్లి మాత్రలు తీసుకున్నాడు. మాత్రలతో పాటు ఆయింట్‌మెంట్ రాసిచ్చారని అడిగితే....మాత్రలు ఇచ్చే సిబ్బంది అది ఇక్కడ లేదని బయట తీసుకోవాలని తేల్చి చెప్పేశారు. చేసేది లేక ఆ యువకుడు ఆస్పత్రి గేటు ఎదుట ప్రైవేటు మందుల షాపుకెళ్లి డబ్బులిచ్చి జెల్‌ను కొనుగోలు చేశాడు.



జీడీనెల్లూరు మండలం బాలయ్యకొత్తూరుకు చెందిన నాగరాజు కుమారుడు షశాంక్ అనే నాలుగేళ్ల చిన్నారికి కాళ్లు, చేతుల్లో పుండ్లు అల్లుకుపోయాయి. ఉదయం 10.45 గంటలకు ఆస్పత్రి వద్దకు వచ్చి 11.15కి ఓపీ తీసుకున్నాడు. 11.18కి డాక్టర్ గది వద్దకు వెళ్లాడు. 11.50కి చికిత్స చేసి వైద్యులు మందులు, మాత్రలు రాసి ముప్పూటలా ఆయింట్‌మెంట్ పూయాలని ఓపీ చీటీలో రాశారు. అయితే అందులో మాత్రలు, సిరప్ మాత్రమే ఆస్పత్రిలో ఇచ్చారు. ఆయింట్‌మెంట్ స్టాక్ లేదు..బయట కొనుక్కోవాల్సిందే.. అంటూ సిబ్బంది జవాబిచ్చారు. తీరా ఆస్పత్రి గేటు ఎదుటే కనిపించే ఓ ప్రైవేటు షాపులో ఆ ఆయింట్‌మెంట్ కొనుక్కుని 12.20 నిమిషాలకు 25 కిలోమీటర్ల దూరంలోని ఇంటికి తిరుగుముఖం పట్టాడు.

కాణిపాకం : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పెద్దాస్పత్రి అని పేరు. ఇక్కడికి చిత్తూరు పరిసర ప్రాంతాలతో పాటు చుట్టు పక్కల మండలాలు, నగరి, పుత్తూరు, పాలసముద్రం, కార్వేటినగరం, పలమనేరు, కుప్పం, వి.కోట, పుంగనూరు, పూతలపట్టు, తమిళనాడులోని కాట్పాడి, వేలూరు, తిరుత్తణి, పొన్నై, సోలింగరం, పరదరామి, గుడియాత్తం, కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా రోగులు, ప్రసవం, ఇతరత్రా అనారోగ్య సమస్యలతో అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే ఇక్కడి వచ్చే రోగులకు సరైన వైద్యం అందక ఇబ్బందులకు గురవుతున్నారు.



స్కానింగ్ చేయించుకునేందుకు నిరీక్షిస్తున్న గర్భిణులు

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సమాచారం

పడకల సంఖ్య 600	ప్రతిరోజూ ఓపీల సంఖ్య 1200
ఇన్‌పేషెంట్ల సంఖ్య 350-400 మంది	ప్రతిరోజూ ఎక్స్‌రేలు 140పైగా
స్కానింగ్‌లు : 110 నుంచి 150 వరకు	
ఈసీజీలు : 130 నుంచి 160 వరకు	
ల్యాబ్ టెస్టులు : 4వేల నుంచి 5,500 వరకు	
ప్రసవాల సంఖ్య : 10 నుంచి 20 వరకు	
సర్జరీలు : 40నుంచి 60 కేసులు	



- ఉదయం 10.35 గంటలకు అత్యవసర విభాగంలోకి వెళితే అక్కడ డాక్టర్లు ఎవరూ కనిపించలేదు. ఆ విభాగం పూర్తిగా ఖాళీగా దర్శనమిచ్చింది. అత్యవసర విభాగానికి పక్కనే ఉన్న సిటీ స్కాన్‌కు తాళం వేసి ఉంచారు 10.38కి సాధారణ ఓపీ (6,7,8) విభాగాల వద్ద రోగులు పలుచగా కనిపించారు. ఒకటి రెండు గదుల్లో డాక్టర్లు లేరు. వీరంతా ఇన్‌పేషెంట్లను చూస్తున్నట్లు వివరణ ఇచ్చారు. మళ్లీ మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఈ విభాగాల్లో జనం కిక్కిరిసారు.
- 10.45 స్కానింగ్ విభాగం వద్దకు వెళితే గర్భిణులు, ఇతరత్రా నొప్పులతో బాధ పడుతున్న వారంతా స్కానింగ్ విభాగం ఎదుట గుమికూడారు. కొంత మందికి మాత్రమే టోకెన్లు ఇచ్చి కూర్చోబెట్టారు.
- 10.48కి ల్యాబ్‌లను పరిశీలిస్తే– బ్లడ్ శ్యాంపిల్స్ సేకరణ గదిలో రోగులు కిటకిటలాడుతున్నారు. రోగులకు అక్కడ కూర్చోవడానికి కుర్చీలైతే లేవు.అక్కడ ఆటోక్లేవ్ రెండు విభాగాలు, ల్యాబ్ నిల్వ విభాగం ఖాళీగా కనిపించింది. ల్యాబ్ పరీక్ష పరికరాన్ని బయట నిరుపయోగంగా ఉంచారు. అక్కడ వచ్చే రోగులు ల్యాబ్ పరీక్ష ఫలితాలను ఆలస్యం ఇస్తున్నారని వాపోతున్నారు. అందులోను కొన్ని తప్పులున్నాయని చెబుతున్నారు.



ఈఎన్‌టీ విభాగంలో ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ



- 11గంటలకు బయో మెడికల్ విభాగం ఖాళీగా ఉంది. అక్కడ డాక్టర్లు, వైద్యులుగానీ లేరు. 11.05కి చర్మ సంబంధిత విభాగం వద్ద ఓ గదిలో ఉన్న డాక్టర్ పేషెంట్లను కూర్చోబెట్టి విద్యార్థులకు టీచింగ్ చేస్తున్నారు. మరో గది మూసి ఉంది.
- 11.25 గంటలకు కంటి విభాగంలోని రెండు గదుల్లో డాక్టర్ల కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. దీంతో అక్కడి రోగులు గంటల కొద్దీ పడిగాపులు కాస్తున్నారు.
- 11.30 గంటలకు ఈఎన్‌టీలో ఒక గదిలోని డాక్టర్ కనిపించలేదు. ఇక్కడ పీజీ డాక్టర్లు మాత్రమే కనిపించారు. మానసిక వైద్య విభాగంలో కూడా ఇదే పరిస్థితి.
- ప్రసూతి విభాగం మధ్యాహ్నం12.40 గంటల ప్రాంతంలో గర్భిణులతో కిటకిటలాడింది. అల్ట్రాసౌండ్ గది వద్ద మొత్తం వాళ్లే కనిపించారు. సిజేరియన్ అయినా బాలింతల గది వద్ద పసికందులను పెట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇరుకైన గదే వారికి దిక్కుగా మారింది. ఇక బాలింతలు అక్కడ ఉక్కపోతకు తట్టుకోలేక ఇళ్ల నుంచి ఫ్యాన్లు తెచ్చుకుని ఉపశమనం పొందుతున్నారు. లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసిన తల్లులకు పాలిచ్చే గదిని తల్లులకు ఇవ్వడం లేదు. ప్రస్తుతం ఆ గది నర్సింగ్ విద్యార్థుల కాలక్షేపానికి పరిమితమైంది. చిన్న పిల్లల విభాగంలో కొళాయిలో తాగునీరు సక్రమంగా రావడం లేదు. దీంతో రోగులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

వసతులు ఉన్నా ..లేకున్నా ఒక్కటే..

అత్యవసర విభాగం వద్ద స్ట్రెక్చర్లు, వీల్‌చైర్లు కరువవుతున్నాయి. వీటిని మందులు తెచ్చుకునేందుకు, నీళ్లు తెచ్చుకోవడానికి వాడుతుండటం కనిపించింది. ఇక అత్యవసర కేసులు వచ్చినా అక్కడి సిబ్బంది పట్టించుకోవడం లేదు. రోగుల సహాయకులే అవస్థలు పడి మెట్లు ఎక్కిస్తున్నారు. అత్యవసర విభాగం వెనుక ఉన్న ర్యాంపు మరమ్మతు గురై ఏడాది అవుతోంది. దీంతో వృద్ధులు మెట్లు ఎక్కలేక శాపనార్థాలు పెడుతున్నారు. ర్యాంపు కింద మురుగు నీటితో ఆప్రాంతం దుర్గంధం చిమ్ముతోంది. ఎంఎస్ వార్డు పాత బిల్డింగ్ గోడలు పెచ్చులూడాయి. పైపులు లీకేజీ అవుతున్నాయి. మంచాలు విరిగి..చినిగి ఉన్నాయి. కొత్త బిల్డింగ్‌లోని పలు వార్డులు ఖాళీగా ఉన్నా వాటిని వినియోగంలోకి తేవడం లేదు. మూడో అంతస్తులో బాలింతల వార్డు ఉంది. ఇక్కడ పురిటి బిడ్డలకు రక్షణ కరువవుతోంది. కుర్చీలు కూడా లేక రోగులు, వారి సహాయకులు కింద కూర్చుంటున్నారు.



లిఫ్ట్‌లో వీల్‌చైర్ తీసుకెళ్లేందుకు నిరీక్షణ



ర్యాంపు లేక ఇబ్బంది పడుతున్న వృద్ధులు

మందులంతా చీటీలోనే..!

జ్వర పీడితులకు కూడా మందులు, మాత్రలు బయట తెచ్చుకోవాలని రాయిస్తున్నారు. ఏవేని గడ్డలు, పుండ్లు, ఇన్‌ఫెక్షన్లకు జెల్, ఆయింట్‌మెంట్లు సైతం ఆస్పత్రుల్లో లేక రోగులు బయట కొనుక్కోవాల్సి వస్తోంది. అలాగే సిరంజిల కొరత వేధిస్తోంది. ఆపరేషన్ల కిట్లు, సబ్బు, ఇతరత్రా వస్తువుల భారం పేషెంట్లపైనే మోపుతున్నారు. వాటిని రోగులే తెచ్చుకోవాలని చెబుతుండటంతో లబోదిబోమంటున్నారు. కోట్లలో నిధులు మూలుగుతున్నా మందులు, మాత్రలు, ఇతరత్రా వస్తువుల కొనుగోలుకు మాత్రం ఖర్చు చేయడం లేదు. దీనికి ప్రధాన కారణం అపోలో, ప్రభుత్వం మధ్య జరుగుతున్న కోల్డ్ వార్!

మరుగుదొడ్లు కంపు..కంపు

ఓపీ విభాగాలు, ఎంఎస్ వార్డు, ప్రసూతి విభాగంలోని మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. ఆవైపు వెళితే ముక్కు మూసుకోవాల్సిందే. ప్రధాన ద్వారం, దొడ్డి ద్వారానికి తలుపులు లేవు. వీటికి పరదాలు కట్టి సరిపెట్టారు. అన్నిచోట్లా కొళాయిలు విరిగి ఉన్నాయి. ఈ కారణంగా మల, మూత్ర విసర్జనకు పలువురు తప్పని పరిస్థితుల్లో వాటిని వాడుకోవాల్సి వస్తోంది. ఎక్కువ మంది బహిరంగ ప్రదేశాల వైపు వెళ్లిపోతున్నారు. పర్యవేక్షణ, నిర్వహణ లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.



వీల్‌చైర్ లేక అవస్థలు పడుతున్న వృద్ధ రోగులు



వీల్‌చైర్‌లో మెడికల్ వస్తువులు తీసుకెళ్తున్న సిబ్బంది



అత్యవసర విభాగంలో డాక్టర్లేరీ?..
(10.35 గంటల ప్రాంతంలో తీసిన చిత్రం)

వీల్‌చైర్లు లేవు



మా నాన్న కళ్లు తిరిగి పడిపోతే ఉరుకులు పరుగులతో ఆటోలో తీసుకొచ్చాం. దించడానికి అవస్థలు పడ్డాం. ఎంఎన్‌ఓలు లేరు. సరే వీల్‌చైర్లు అయినా ఉన్నాయా? అంటే అవీ లేవు. వచ్చిన ప్రతిసారీ ఇక్కడ ఇబ్బంది పడుతున్నాం. అధికారులు పట్టించుకుని అత్యవసర విభాగం వద్ద వీల్‌చైర్లు, స్ట్రెక్చర్లు ఉండేలా చూడాలి.
–సుమతి, ముక్కళత్తూరు, జీడీనెల్లూరు మండలం

పసిబిడ్డను నేలమీద పెట్టుకోవాలి



సిజేరియన్ కేసులను రెండు, మూడురోజుల పాటు ఐసీయూలో పెడుతారు. ఈ సమయంలో పసికందును ఐసీయూ బయట ఉన్న హాల్‌లో కిందే పెట్టుకోవాలి. ఇరుకుగా ఉంటుంది. ఆ హాల్లోనే వాళ్లూ.. వీళ్లూ వచ్చి వెళుతుంటారు. చాలా ఇబ్బందిగా ఉంటుంది. ప్రత్యేక గది ఇస్తే మేలు.
–లావణ్య, బంగారుపాళ్యం

నయం కాలేదు



ఇప్పటికే ఎన్నోసార్లు ఆస్పత్రికి వచ్చాను. ఆపరేషన్లు కూడా చేయించుకున్నాను. కానీ ప్రయోజనం లేదు. అవన్నీ సరైన ఫలితం ఇవ్వలేదు. మళ్లీ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి ఆపరేషన్ చేయించుకున్నా. ఇప్పుడు పర్వాలేదు. రెండు మూడు అనారోగ్య సమస్యలకు ఇక్కడే వచ్చి చూపించుకుంటున్నా. తప్పని పరిస్థితిల్లో వచ్చి వెళుతున్నా. వారిచ్చే మందులు, మాత్రలు వేసుకుంటున్నా.
–గోవిందయ్య, చిత్తూరు మండలం

న్యూస్‌రీల్

సైబర్ మోసాలు, డ్రగ్స్‌పై అప్రమత్తం

– చిత్తూరు వాకథాన్‌లో ఎస్పీ మణికంఠ



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్పీ తదితరులు

చిత్తూరు అర్బన్: సైబర్ మోసాలు, మాదక ద్రవ్యాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు హెచ్చరించారు. 'సైబర్ మోసాలపై అప్రమత్తం–డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు' అనే అంశంపై చిత్తూరులో బుధవారం జిల్లా పోలీసుశాఖ విద్యార్థులతో వాకథాన్ (నడక ర్యాలీ) నిర్వహించింది. ఎస్పీ మాట్లాడుతూ, స్మార్ట్ ఫోన్లు వచ్చాక మొత్తం డిజిటల్ ప్రపంచం అరచేతిలోకి వచ్చేసిందన్నారు. మనం ఏం చేస్తున్నా కూడా సాంకేతిక పరిజ్ఞానం పసిగడుతూ ఉంటుందన్నారు. మొబైల్‌లో ఉపయోగించే వ్యక్తిగత డేటా, సమాచారం జాగ్రత్తగా ఉండాలంటే అప్రమత్తం అవసరమన్నారు. అనవసరమైన లింకులు క్లిక్ చేయడం, తప్పుడు ఫోన్ కాల్స్‌ను సమాధానమివ్వడం చేయరాదన్నారు. సైబర్ మోసాల బారినపడ్డ వాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేస్తే, నగదు బదిలీ నిలుపుదల చేయడం, మోసం చేసినవాళ్లను గుర్తించడం సాధ్యమవుతుందన్నారు. పలమనేరులోని డాయ్ యాప్‌లో జరిగిన రూ.6 కోట్ల మోసం కూడా సైబర్ నేరం కిందకే వస్తుందన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. ఎక్కడైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు తెలిస్తే డయల్100 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీలు ఆరీఫుల్లా, నాగేశ్వరరావు, డీఎస్పీలు రాజగోపాల్‌రెడ్డి, మహబూబ్ బాషా, ఇలియాస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో వరసిద్ధుని వార్షిక బ్రహ్మోత్సవాలు

కాణిపాకం: సెప్టెంబర్ 7 నుంచి 27వ తేదీ వరకు స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు అందరూ సమష్టి కృషి చేయాలని ఈఓ వాణి కోరారు. బుధవారం కాణిపాక ఆలయ సమావేశ మందిరంలో అధికారులు, అర్చకులు, వేదపండితులు, సిబ్బందికి సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలు నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, ధనుంజయ, సూపరింటెండెంట్లు వాసు, మల్లికార్జున, రంగసామి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ తేనీటి విందుకు శెట్టిపల్లె సర్పంచ్

కుప్పం: స్వాతంత్య్ర దిన వేడుకల సందర్భంగా రాజ్‌భవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనాలని గుడుపల్లె మండలం శెట్టిపల్లె మహిళా సర్పంచ్ రీటా యల్లప్పకు ఆహ్వానం అందింది. గురువారం విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నర్ నజీర్ అహ్మద్ రాజకీయ ప్రముఖులకు ఇచ్చే తేనీటి విందులో ఆమె పాల్గొంటారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు 20 సమస్యలు



వినతులు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో బుధవారం నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్‌కు 20 సమస్యలు వచ్చాయి. వీటిలో 8 పరిష్కరించినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. చిత్తూరులో వినతులను ఈఈలు మునిచంద్ర, హరి, డీఈలు శేషాద్రి, పద్మనాభపిళ్లై, జ్ఞానేశ్వర్ స్వీకరించారు.

డెంగీపై జాగ్రత్త

తవణంపల్లె: డెంగీ వ్యాధి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ కోరారు. బుధవారం మండలంలోని దిగువమాఘం గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామాల్లో ప్రజలు డెంగీ బారిన పడకుండా అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని 22 గ్రామాల్లో దోమల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ తయారు చేసి అమలు చేయాలన్నారు. జిల్లా అదనపు మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ పీరూసాహెబ్, వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పలమనేరులో జైళ్లశాఖ పెట్రోల్ బంకు

–భూమిపూజ చేసిన ఐజీ శ్రీనివాసరావు

పలమనేరు: పట్టణంలో గతంలో జైలు ఉన్న స్థలంలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ అవుట్‌లెట్ నిర్మాణానికి ఆ శాఖ ఐజీ శ్రీనివాసరావు బుధవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ, కొన్నేళ్లుగా ఈ స్థలం వృధాగా ఉందన్నారు. దీంతో ఐఓసీఎల్ ద్వారా ఇక్కడ పెట్రోల్ బంకును ఏర్పాటు చేస్తున్నామని, నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెస్తామన్నారు. ఇక్కడ జైలులోని ఖైదీలే విధుల్లో ఉంటారని చెప్పారు. ఇప్పటికే చిత్తూరులో ఇలాంటి బంకు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జైళ్లశాఖ డీఐజీ వరప్రసాద్, రోహిత్ మోహన్, మణికాంత్, గోపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు బహుమతుల ప్రదానం

చిత్తూరు కలెక్టరేట్ : జీవ వైవిధ్య పరిరక్షణ అంశంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 15న పోలీస్ పరేడ్ మైదానంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్టు ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కో–ఆర్డినేటర్ బాలచైతన్య బుధవారం విలేకరులకు తెలిపారు. 8 నుంచి ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థులకు ఈ నెల 12న పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో జీవ వైవిధ్య పరిరక్షణ అంశంపై వక్తృత్వ, డిబేట్, షార్ట్ ఫిలిం మేకింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. వక్తృత్వ విభాగంలో భావన (జెడ్పీ నెలేపల్లె, జీడీనెల్లూరు), హేమ (జెడ్పీ, మంగళంపల్లె, బంగారుపాళ్యం మండలం), హరిప్రియ (జెడ్పీ పుదుపేట్, నగరి), డిబేట్‌లో ఆకాష్ (పీసీఆర్ పాఠశాల, చిత్తూరు), హాస్ (కణ్ణన్ పాఠశాల, చిత్తూరు), సాయిచరణ్ (పీసీఆర్, చిత్తూరు), షార్ట్ ఫిలిం మేకింగ్‌లో జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గెలుపొందారని వివరించారు. వీరంతా స్వాతంత్ర్య దిన వేడుకల్లో ముఖ్యఅతిథి చేతుల మీదుగా బహుమతులు అందుకోవాలని కోరారు.



అందరూ ఉత్తములేనా?



- ‘ఏం చెప్పేది బాబూ..! కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఎస్సై వరకు వచ్చా. ఒక్క మెమో కూడా అందుకోలేదు. మరో ఆర్నెళ్లలో రిటైర్మెంట్ వస్తుంది. మా పేర్లంతా కలెక్టర్‌కు పంపరు. ఆఫీసర్ల ఇళ్లకు కూరగాయలు తేవడం, వారి కుక్క పిల్లలకు స్నానాలు చేయించడం. ఆదివారం అయితే అంగడి వాడ్ని దబాయించి మరీ 2 కిలోల పొట్టేలు మాంసం ఫ్రీగా తెచ్చివ్వడం నాకు చేతకాదు. ఆ పనులు చేసే వాడ్ని అయితే ఎపుడే అవార్డు వచ్చేది. ఆ పనులు నేను చేయలేను. ఆ అవార్డులు నాకు రావు. ఈ బాధంతా మాపై అధికారులకు కూడా చెప్పుకోకూడదు. ఎందుకంటే పోలీసులు క్రమశిక్షణకు మారు పేరు కదా..’

–ఓ ఏఎస్సై నిట్టూర్పు

- జెండా పండుగన చాంతాడంత జాబితా!
- ఉత్తముల పేరిట మళ్లీ మళ్లీ వారికే గుర్తింపు
- పేర్ల ప్రతిపాదనలో ‘పచ్చ’ నేతల జోక్యం
- వెయ్యి మందికి పైగా పేర్లను పంపిన శాఖలు
- నేడు మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు
- కష్టపడే వారికి దక్కని ‘ప్రశంసలు’.. ‘గుర్తింపు’



- ‘‘ఈయన పేరు సలీమ్ బాషా. వయసు 61 ఏళ్లు. 43 ఏళ్ల పాటు చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. ఐదేళ్లకు పైగా జీతం ఇవ్వకుండా సాకులు చూపించి అధికారులు ఇబ్బందులు పెడుతున్నా ఉదయం 10 గంటలైతే కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చేస్తారు. సాయంత్రం వరకు ఇక్కడే ఉంటూ విధులు నిర్వర్తిస్తారు. వచ్చే ఏడాది ఈయన రిటైర్‌మెంట్. ఏ రాజకీయ పార్టీలో సలీమ్‌కు సంబంధం లేదు. ఈయన విధి నిర్వహణలో చూపే నిబద్ధతకు నేడు జరగనున్న పంద్రాగస్టు వేడుకల్లో తప్పనిసరిగా ప్రశంసాపత్రాన్ని ఇవ్వాలి. కానీ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులు రూపొందించిన ఉత్తముల జాబితాలో మొన్నొచ్చిన ఓ మేస్త్రీకి, ఇప్పటికే పలుమార్లు ప్రశంసా పత్రాలు అందుకున్న నలుగురు వ్యక్తులను ఎంపిక చేయడం గమనార్హం! కేవలం తాము చెప్పిన పనులన్నీ నోరు మెదపకుండా చేయడమే ఉత్తములకు ప్రామాణికంగా అధికారులు ఎంపిక చేసినట్లు విమర్శలున్నాయి.’’

చిత్తూరు అర్బన్: స్వాతంత్ర్య దిన వేడుకల్లో ప్రభుత్వ అధికారులకు ప్రదానం చేసే ప్రశంసా పత్రాల కార్యక్రమంలోనూ ‘పచ్చ’ మార్కు పెత్తనం కనిపిస్తోంది. ఉత్తమ సేవలను అందించిన అధికారుల ఎంపిక ప్రక్రియ అపహాస్యమైపోతోంది. ఒకప్పుడు పలు కోణాల్లో పరిశీలించి ఉత్తమ అవార్డుకు అధికారుల్ని ఎంపిక చేసేవారు. ఇప్పుడు అలా కాదు.. ఉన్నతాధికారుల అడుగులకు మడుగులొత్తే వాళ్లే ఉత్తములుగా ఎంపికవుతున్నారు. తన చుట్టూ.. పార్టీ కోసం భజన చేసే వ్యక్తులకు అవార్డులు ఇవ్వాలనే నేతల ఆదేశాలను ఉన్నతాధికారులు తూ.చ తప్పక పాటిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ కార్యాలయాల్లో కష్టపడి సేవలందించే అధికారులకు మొండిచేయ్యే మిగులుతోంది. ఉద్యోగ విరమణ వయస్సు దగ్గరపడుతున్నా తమ సేవలకు గుర్తింపు లేదని పలువురు లోలోనే కుమిలిపోతున్నారు.

కొలమానమేదీ..?

పోలీసులు, రెవెన్యూ, వైద్యశాఖ, మునిసిపాలిటీ, రవాణాశాఖ.. ఇలా జిల్లాలో 60కు పైగా ప్రభుత్వ శాఖల్లో 50 వేల మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రతి ఏటా గణ తంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య దిన వేడుకల్లో కొందరు ఉద్యోగుల్ని ఎంపిక చేసి మంత్రి, కలెక్టర్, ఇతర అధికారుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు ఇవ్వడం ఆనవాయితీ. దశాబ్దన్నర కాలం క్రితం వరకు అయితే కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకోవాలంటే ఉద్యోగి పూర్వాపరాలు, నడవడిక లాంటి ఎన్నో గుణగణాలను పరిగణనలోకి తీసుకునే వారు. అనేక కోణాల్లో పరిశీలించి అవార్డులకు ఎంపిక చేసేవారు. మంత్రి, జిల్లా యంత్రాంగం చేతుల మీదుగా ప్రశంసాపత్రం, అవార్డు తీసుకోవడమంటే గర్వకారణంగా చెప్పుకునేవాళ్లు. పనిచేసే శాఖలోని తోటి ఉద్యోగులతో పాటు కుటుంబ సభ్యులు, సమాజంలో ఈ అవార్డు తీసుకున్న ఉద్యోగి తమ వాళ్లనే చెప్పుకునేవాళ్లు. కానీ ఇప్పుడదంతా ప్రహసనంగా మారింది. అసలు ఏ ప్రాతిపదికన ఉద్యోగులను ఎంపిక చేస్తున్నారో ఎవ్వరికీ తెలియడం లేదు.

ఎవరి ఇష్టం వాళ్లది..

ఇపుడు ఉద్యోగుల జాబితాను తయారు చేయడంలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖాధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తూ వారికి నచ్చిన పేర్లనే ఉన్నతాధికారులకు పంపు తున్నారన్నారు. ఇదే సమయంలో రాజకీయ నేతల జోక్యం పెరిగిపోవడంతో ఉత్తముల జాబితాలోని పేర్లు రాత్రికి రాత్రే మారిపోతున్నాయి! పైగా పోలీసు, రెవెన్యూ, స్థానిక సంస్థల్లో పెచ్చుమీరిన అవినీతి కారణంగా ఉత్తమ ఉద్యోగుల జాబితాలోని సగానికి పైగా పేర్లు అధికారుల జేబులు నింపేవారికేననే ఆరోపణలు పలు శాఖల్లో వినిపిస్తోంది. విధి నిర్వహణలో సస్పెన్షన్లకు గురైన వాళ్లు, అవినీతి ఆరోపణలు ఉన్న ఉద్యోగులు, చార్జ్ మెమోలు పెండింగ్ ఉన్న వాళ్లు, ఏసీబీ అధికారులకు చిక్కిన వాళ్లకు సైతం ఉత్తములంటూ సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారులైతే నిత్యం వారిని అంటిపెట్టుకుని చెప్పిన పనులన్నీ చేసే వారిని, క్రమం తప్పకుండా మామూళ్లు ముట్టచెప్పే వారిని ప్రశంసా పత్రాలు అందుకోవడానికి ఎంపిక చేస్తున్నారు. ఈసారి కూడా పలు ప్రభుత్వ శాఖల నుంచి వెయ్యి మందికి పైగా పేర్లు సిద్ధం చేశారు. ఇంత మందికి ప్రశంసా పత్రాలు ఇవ్వడం సాధ్యం కాదని, జాబితాను కుదించాలని పలు శాఖలకు జాబితాను తిప్పి పంపినట్లు తెలుస్తోంది. ఉద్యోగుల ఎంపికలో నీతి, నిజాయితీ, పనితీరు ఏమిటనేది ప్రశ్నార్థకమే. అధికారులు దేనిని కొలమానంగా తీసుకుని పేర్లను ఎంపిక చేస్తున్నారని వేలాదిమంది ఉద్యోగుల భేతాళ ప్రశ్న.

నేడు స్వాతంత్ర్య దిన వేడుకలు

- పతాకావిష్కరణ చేయనున్న మంత్రి సత్యకుమార్

చిత్తూరు అర్బన్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78వ ఏట అడుగిడుతున్న నేపథ్యంలో గురువారం జిల్లా కేంద్రంలో స్వాతంత్ర్య దిన వేడుకలు నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చిత్తూరు లోని పోలీసు శిక్షణ కేంద్రంలో నిర్వహించే వేడుకల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. ఉదయం 8.20 గంటలకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ సభా వేదిక వద్దకు చేరుకుంటారు. 8.35 గంటలకు మంత్రి జెండా ఎగురవేసి సందేశమిస్తారు. అనంతరం పోలీసుల కవాతు, పలు ప్రభుత్వ శాఖల శకటాలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది. 10.20 గంటలకు ఉత్తమ ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాల ప్రదానం, పలు ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన, ప్రభుత్వం తరపున లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ చేస్తారు.



జెండా వందనం చేస్తున్న ఎస్పీ మణికంఠ

పోలీసుల కవాతు

పోలీస్ శిక్షణ కేంద్రంలో బుధవారం పోలీసుల కవాతు ట్రయల్స్ నిర్వహించారు. దీనిని ఎస్పీ మణికంఠ వీక్షించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఇక్కడ ఏర్పాట్లను డ్వామా పీడీ రాజశేఖర్ పరిశీలించారు. శాఖల వారీగా చేయాల్సిన పనులను జెడ్పీ సీఈఓ గ్లోరియా, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి, పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్‌కు అప్పగించి వారితో కలిసి పర్యవేక్షించారు.

కుమార్తె నిశ్చితార్థం కోసం వచ్చి మృత్యువాత

శాంతిపురం: కుమార్తె వివాహ నిశ్చితార్థం కోసం వచ్చిన తండ్రి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన విషాద సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు..121 పెద్దూరు పంచాయతీ బెండనకుప్పానికి చెందిన నారాయణ స్వామి ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. తన కుమార్తెకు ఆదివారం నిశ్చితార్థం ఉండడంతో సెలవుపై ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. బుధవారం భార్య విజయలక్ష్మితో కలిసి కర్ణాటకలోని కేజీఎఫ్‌లో శుభకార్యానికి కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తూ శెట్టిపల్లె రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఎదురుగా వచ్చిన కర్ణాటక రాష్ట్రం క్యాసంబల్లికి చెందిన ఓ ప్రైవేటు స్కూలు బస్సు వీరి బైకును ఢీకొంది. దీంతో నారాయణస్వామి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన విజయలక్ష్మిని కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. రాళ్లబూదుగూరు ఎస్‌ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నారాయణస్వామి మృతదేహం

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడి ట్రాక్టర్‌కు నిప్పు

బైరెడ్డిపల్లె: కూటమి నేతలు మరోసారి రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ నేతలనే టార్గెట్ చేస్తూ ఆస్తుల ధ్వంసం చేయడం ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. వివరాలు.. బైరెడ్డిపల్లెకు చెందిన శేషేగౌడు పెద్దచెరువు సమీపంలో ఇటుక బట్టీ నిర్వహిస్తున్నాడు. ఈ బట్టీలో ఉంచిన ట్రాక్టర్‌కు బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ట్రాక్టర్ ముందుభాగం టైర్లు అంటుకుంటుండగా బట్టీలో కాపలా ఉంటున్న వ్యక్తి చూసి మంటలను అదుపుచేశాడు. దీంతో టైర్లు, వైరింగ్ మాత్రమే కాలిపోయాయి. రెండు రోజుల క్రితం బైరెడ్డిపల్లెకు చెందిన నవాబ్‌బాషా చెప్పుల దుకాణానికి నిప్పు పెట్టడంతో పరిశీలించడానికి వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి శేషేగౌడు వెళ్లాడు. దీంతో కూటమి నేతలే శేషేగౌడు ట్రాక్టర్‌కు నిప్పు పెట్టి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బాధితుడు ఈ ఉదంతంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



పాక్షికంగా కాలిన శేషేగౌడు ట్రాక్టర్



కోల్‌కత్తాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో పీజీ వైద్య విద్యార్థిని హత్యాచార ఉదంతాన్ని నిరసిస్తూ చిత్తూరు మురకంబట్టులోని అపోలో కళాశాల పీజీ వైద్య విద్యార్థులు బుధవారం సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు నరేష్‌కుమార్‌రెడ్డి, అగస్టిన్, రమ్య, శ్రావణదీప్తి, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు. – చిత్తూరు రూరల్ (కాణిపాకం)

108 డ్రైవర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

నగరి: మద్యం సేవించి 108 వాహనాన్ని నడుపుతున్న కిషోర్ అనే డ్రైవర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్ తెలిపారు. ముందస్తుగా వచ్చిన ఫిర్యాదు మేరకు.. బుధవారం ఓం శక్తి ఆలయం సమీపాన బైపాస్ సర్కిల్ వద్ద వస్తున్న 108 వాహనాన్ని ఆపి డ్రైవర్‌ను పరీక్షించగా మద్యం సేవించి ఉన్నట్లు రుజువైందని, దీంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాదిగబండ అక్రమ క్వారీని సీజ్ చేయాల్సిందే

ఆర్డీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆందోళన

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ టీడీపీ నేత జనార్ధన్‌నాయుడు అక్రమంగా సాగుస్తున్న క్వారీని అధికారులు వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశాయి. నాయకులు మాట్లాడుతూ, మాదిగబండ వద్దనున్న క్వారీ ప్రస్తుతం వీ.కోట మండలానికి చెందిన శరత్‌కుమార్ పేరిట ఉందన్నారు. ఆయన క్వారీ నష్టాల్లో ఉండడంతో కరెంట్ సర్వీసును తొలగించాలని స్థానిక ట్రాన్స్‌కో అధికారులకు గతంలోనే ఆయన విజ్ఞప్తి చేశారన్నారు. మరోవైపు స్థానిక మైనింగ్ అధికారులు సైతం మాదిగబండ క్వారీ అనర్హత జాబితాలో ఉందని తేల్చారన్నారు. అలాంటి క్వారీని ఇన్ని నెలలుగా మైనింగ్ అధికారులు ఎందుకు సీజ్ చేయలేదని ప్రశ్నించారు. తనకు కరెంట్ కనెక్షన్ వద్దని శరత్‌కుమార్ కోరినా ట్రాన్స్‌కో ఏడీ ఎందుకు తొలగించలేదని నిలదీశారు. క్వారీలోని భూములు సైతం తన పేరిట పట్టాపాస్ బుక్కు వచ్చిందని యజమాని శరత్‌కుమార్ దీనికి సంబంధించిన డాక్యుమెంట్లను, అలాగే క్వారీకి సంబంధించిన పూర్తి పత్రాలను ఆర్డీఓకు అందజేశారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ మనోజ్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎవరికి హక్కుందో వారికి న్యాయం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పలమనేరు మండల కన్వీనర్ బాలాజీనాయుడు, నాయకులు విశ్వనాథరెడ్డి, రాజారెడ్డి, చెంగారెడ్డి, ప్రహ్లాద, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్నానం చేసే మహిళల వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్!

- ముందుగానే పలు వీధుల్లో రెక్కీ
- ఆపై బాత్‌రూముల్లో మైక్రో కెమెరా సెటప్
- వీడియో తీశాక సామాజికి మాధ్యమాల్లో పోస్టింగ్
- డబ్బులివ్వాలంటూ బ్లాక్ మెయిలింగ్

పలమనేరు: స్నానం చేస్తున్న మహిళల వీడియోలు తీసి, ఆపై వారికి పంపి బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు గుంజుతున్న ఓ ప్రబుద్ధుడి లీలలు బుధవారం పలమనేరులో వెలుగులోకి వచ్చాయి. వివరాలు.. పలమనేరులోని గంటావూరుకు చెందిన బాలసుబ్రమణ్యం అలియాస్ బాలు(32) గతంలో ఆటో డ్రైవర్‌గా పనిచేశాడు. కొంతకాలంగా పనీపాటా లేకుండా తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో సులువుగా డబ్బు సంపాదించేందుకు కొత్తమార్గాన్ని ఎంచుకున్నాడు. పట్టణలో కాస్త నిర్మానుష్యంగా వీధుల్లో రెక్కీ చేశాడు. ఆ వీధుల్లో మహిళలు స్నానం చేసే బాత్‌రూమ్‌లు, వాళ్లు స్నానం చేసే సమయాలను గమనించి, ఆపై వారికి తెలియకుండా ఇళ్ల ముందు బాత్‌రూమ్‌లలో మైక్రో కెమెరాలను రహస్యంగా ఉంచి, ఆ తర్వాత గుట్టుగా వాటిని తీసుకెళ్లేవాడు. తదుపరి మహిళ భర్త, లేదా తండ్రికి ఫోన్ చేసి న్యూడ్ వీడియోలు తన వద్ద ఉన్నాయని, అడిగినంత డబ్బు ఇవ్వకపోతే వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బ్లాక్‌మెయిల్ చేసేవాడు. ఇప్పటికే పట్టణంలో ఇలా కొందరిని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు గుంజినట్లు సమాచారం. అయితే దీనిపై బాధితులెవరూ ఫిర్యాదు చేయకపోవడం నిందితునికి కలిసొచ్చింది. తాజాగా గంటావూరులో ఓ మహిళ స్నానం చేస్తున్న వీడియోపై వారి పెద్దలను బ్లాక్‌మెయిల్ చేశాడు. వారు సెటిల్‌మెంట్‌కు పిలిచి నిందితుడిని గుర్తించారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడతో ఇది వెలుగుచూసింది. అయితే దీనిపై నిందితుడు కొందరి పెద్ద మనుషుల ద్వారా కేసును ఉపసంహరించుకునేందుకు ఫిర్యాదితో డీల్ చేస్తున్నట్టు సమాచారం. ఇదలా ఉంచితే, ఇప్పటికే కొన్ని కేసుల్లో జైలుకెళ్లివచ్చిన నిందితుడు నిత్యం ఒంటికి ఆముదం నూనె రాసుకుంటాడని తెలిసింది. ఎందుకంటే పోలీసులు ఒకవేళ పట్టుకునేందుకు ప్రయత్నిస్తే నూనె కారణంగా వారికి దొరక్కుండా ఉడాయించేందుకు ఇలాంటి ప్లాన్ వేస్తాడని తెలిసింది.

ఔను..వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు!

–చిత్తూరు వధువు..అమెరికా వరుడు

కాణిపాకం : చిత్తూరు అమ్మాయి.. అమెరికా అబ్బాయి.. వీళ్లిద్దరూ ఒకరినొకరు ఇష్టపడ్డారు. ఇరుపక్షాల కుటుంబాల వారినీ ఒప్పించారు. ఖండాంతరాల ప్రేమను పండించుకున్న అమెరికా అబ్బాయి, చిత్తూరు అమ్మాయి వివాహబంధంతో ఒక్కటయ్యారు. అమెరికాకు చెందిన మైఖేల్ జాక్ మెన్‌కు, చిత్తూరుకు చెందిన దయాసాగర్‌రెడ్డి కుమార్తె మంజూశ్రీకి బుధవారం సంతపేట ప్రాంతంలోని ఓ పెళ్లి మండపంలో హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహమైంది. మంజూశ్రీ 2018లో ఎంఎస్ చదవడానికి అమెరికాకు వెళ్లింది. అక్కడే చదువు పూర్తి చేసి ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో మైఖేల్ పరిచయమయ్యాడు. ఇలా వీరి పరిచయం పెళ్లి వరకు దారితీసింది. 2023 ఏప్రిల్‌లో మంజూశ్రీ కుటుంబీకులు అమెరికా వెళ్లి హిందూ సాంప్రదాయ ప్రకారం నిశ్చితార్థం చేశారు.



మైఖేల్, మంజూశ్రీ జంట

బస్సును ఢీకొన్న మైనర్లు

సదుం: ఇద్దరు మైనర్ విద్యార్థులు ద్విచక్రవాహనంలో వెళ్తూ అదుపు తప్పి ప్రైవేటు బస్సును ఢీకొన్న సంఘటన బుధవారం స్థానిక గాంధీరోడ్డులో చోటుచేసుకుంది. బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా పలువురు మైనర్ విద్యార్థులు ద్విచక్ర వాహనాలను నడుపుతున్నారని.. పట్టణంలోను మితిమీరిన వేగంతో వెళ్తున్నారని, వారిని సంబంధిత అధికారులు కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.